భావి చిత్రకారులకు మార్గదర్శి అంబాజీ

● ప్రముఖ కవి, రచయిత ఏనుగు నర్సింహారెడ్డి


అంబాజీకి విశిష్ట పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న ఇనాక్, తదితరులు

హైదరాబాద్ సిటీ/కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జీవం ఉట్టిపడేలా చిత్రాలను గీసే అంతర్జాతీయ చిత్రకారుడు అంబాజీ భవిష్యత్ తరాలకు మార్గదర్శి అని ప్రముఖ కవి, రచయిత ఏనుగు నర్సింహారెడ్డి అన్నారు. చిన్నతనంలోనే పాఠశాలలో రాముడు అని రాయమంటే శ్రీరాముడి చిత్రపటాన్ని పలకపై చిత్రించారని ప్రశంసించారు. తెలుగు విశ్వవిద్యాలయం 39వ వ్యవస్థాపక దినోత్సవాన్ని బాచుపల్లి ప్రాంగణంలోని సమావేశ మందిరంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తిరుపతి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ పూర్వ ఉపకులపతి పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ అంబాజీకి అంతర్జాతీయ విశిష్ట పురస్కారం, రూ.లక్ష చెక్కును ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఇనాక్ మాట్లాడుతూ తెలుగు వారి సంస్కృతి, కళలకు ఈ విశ్వవిద్యాలయం చిహ్నంగా నిలిచిందన్నారు. అంబాజీ చిత్రకళలో ద్రోణుడు లేని ఏకలవ్యుడిగా నిలిచారని తెలుగు యూనివర్సిటీ వీసీ కిషన్‌రావు అన్నారు. రిజిస్ట్రార్ రమేశ్ భట్టు మాట్లాడుతూ విశ్వవిద్యాలయ చిత్రలేఖనం విద్యార్థులు అంబాజీని స్ఫూర్తిగా తీసుకొని ముందుకుసాగాలని పిలుపునిచ్చారు.


పురస్కారగ్రహీతలతో అతిథులు

ఆర్టీసీ ప్రగతిలో డ్రైవర్ల పాత్ర కీలకం

రవీంద్రభారతి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ప్రగతిలో డ్రైవర్ల పాత్ర కీలకమని గ్రేటర్ జోన్ ఈడీ వి.వెంకటేశ్వర్లు అన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో మహాకవి సినారె కళాపీఠం ఆధ్వర్యంలో రవీంద్రభారతి కాన్ఫరెన్స్‌హాల్‌లో ఉత్తమ డ్రైవర్లకు సత్కారం చేశారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ టీఎస్ఆర్టీసీ దేశంలోనే నంబర్‌వన్‌గా కొనసాగుతోందన్నారు. ప్రమాదాల విషయంలో కూడా అతి తక్కువ రేటును నమోదు చేసుకుందని తెలిపారు. డ్రైవర్‌గా పనిచేస్తూ తోటి డ్రైవర్ల సేవలను గుర్తించి పురస్కారాలు ప్రదానం చేయడం రాములు గొప్పతనానికి నిదర్శనమని అన్నారు. తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ నందిని సిధారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నేటి నిజం సంపాదకుడు బైస దేవదాసు, ఆర్టీసీ సికింద్రాబాద్ రీజినల్ మేనేజర్ ఖుస్రోషాఖాన్, టీఎస్ రావు, కంటోన్మెంట్ డిపో మేనేజర్ ఎల్.రామ్మోహన్, దాసరి దయానంద్ రెడ్డి, తేజ, తదితరులు పాల్గొన్నారు.

దేశంలో మరో 114 కృషి విజ్ఞాన కేంద్రాలు

● ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షుపాఠక్


సదస్సులో పాల్గొన్న డాక్టర్ హిమాన్షుపాఠక్, తదితరులు

రాజేంద్రనగర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): దేశంలో మరో 114 కృషి విజ్ఞాన కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ రూపొందించనున్నట్లు భారత వ్యవసాయ పరిశోధన మండలి(ఐసీఏఆర్) డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు పాఠక్ ప్రకటించారు. తెలంగాణలోని కృషి విజ్ఞాన కేంద్రాలు 2024-25లో అమలు చేయాల్సిన వార్షిక కార్యాచరణ ప్రణాళిక గురించి చర్చించేందుకు రెండు రోజులపాటు నిర్వహిస్తున్న సదస్సును శుక్రవారం ఆయన రాజేంద్రనగర్‌లోని విస్తరణ విద్యాసంస్థలో ప్రారంభించారు. ఈ సదస్సును ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఐసీఏఆర్ అగ్రికల్చరల్ టెక్నాలజీ అప్లికేషన్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్(అటారీ) 10వ జోన్ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ఈ సందర్భంగా డాక్టర్ హిమాన్షు పాఠక్ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న కృషి విజ్ఞాన కేంద్రాలను ఆధునికీకరిస్తున్నట్లు తెలిపారు. తద్వారా రైతులకు మరింత మెరుగైన సేవలు అందుతాయన్నారు. కార్యక్రమంలో మేనేజ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ పి.చంద్రశేఖర, వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.వెంకటరమణ, పరిశోధనా సంచాలకులు డాక్టర్ పి.రఘురామిరెడ్డి, నార్మ్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు, డాక్టర్ వి.సుధారాణి, శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ విజయ, పీవీ నర్సింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ మహేందర్, విశ్వవిద్యాలయం అధికారులు, శాస్త్రవేత్తలు, కేవీకేల కో-ఆర్డినేటర్లు పాల్గొన్నారు. కాగా, ఐసీఏఆర్‌లో ఉద్యోగంలో చేరిన అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు, ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ ఆఫీసర్లు ఐసీఏఆర్ బలోపేతానికి కృషి చేయాలని డాక్టర్ హిమాన్షు పాఠక్ సూచించారు.

క్వాలిటీ ఎడ్యుకేషన్‌కు 'శివ్‌నాడార్' ది బెస్ట్

● 95 శాతం విద్యార్థులకు ప్లేస్‌మెంట్స్


మాట్లాడుతున్న డాక్టర్ రాజీవ్‌కుమార్‌సింగ్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విద్య, ఉద్యోగావకాశాలు పొందాలనుకునే విద్యార్థులు, తల్లిదండ్రుల ఆకాంక్షలను ఢిల్లీలోని శివ్‌నాడార్ విశ్వవిద్యాలయం(ఎస్ఎన్‌యూ) తప్పకుండా నెరవేరుస్తుందని అడ్మిషన్స్ ఛైర్‌పర్సన్ డాక్టర్ రాజీవ్‌కుమార్‌సింగ్ అన్నారు. శుక్రవారం నగరంలోని ఓ హోటల్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శివనాడార్ యూనివర్సిటీ ప్రత్యేకతలు, అడ్మిషన్ల విధానం, గతేడాది సాధించిన ఫలితాల గురించి వివరించారు. యూనివర్సిటీలో ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, నాచురల్ సైన్స్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ విభాగాలు(స్కూల్స్) ఉన్నాయని, విలువలు, నైతికత, నాయకత్వ లక్షణాలతోపాటు బహుళ విభాగాల(మల్టీ డిసిప్లినరీ) విధానంతో అంతర్జాతీయస్థాయి విద్యను అందిస్తున్నామని పేర్కొన్నారు. ఎడ్యుకేషన్, ప్లేస్‌మెంట్స్ మధ్య రిలేషన్‌ను విద్యార్థులు అర్థం చేసుకునేలా శిక్షణ ఇచ్చేందుకు కెరీర్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి యేటా 95 శాతం మంది విద్యార్థులకు(గరిష్ఠంగా రూ.58 లక్షలు, సగటున రూ.11 లక్షల ప్యాకేజీలతో) ప్లేస్‌మెంట్స్ వస్తున్నాయని చెప్పారు. అడ్మిషన్ల విధానం, ఫీజులు, ఇతర వివరాలకు శివ్‌నాడార్ యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సిందిగా సూచించారు.

టెన్నిస్ రన్నరప్ వేమూరి అభయ


ఆకాంక్షకు ట్రోఫీ బహూకరిస్తున్న రామారావు, చాముండేశ్వర్‌నాథ్, తదితరులు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఎఫ్ఎన్‌సీసీ జాతీయ మహిళల టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్ అమ్మాయి వేమూరి అభయ రన్నరప్‌గా నిలవగా, ఆకాంక్ష(మహారాష్ట్ర) టైటిల్ కైవసం చేసుకుంది. శుక్రవారం ఫిలింనగర్‌లోని ఎఫ్ఎన్‌సీసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన ఫైనల్లో ఆకాంక్ష 6-4, 6-3తో అభయపై నెగ్గి, విజేతగా నిలిచింది. సినీనిర్మాత కేఎస్ రామారావు, హైదరాబాద్ సీపీ శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర బ్యాడ్మింటన్ సంఘం ఉపాధ్యక్షుడు చాముండేశ్వర్‌నాథ్ కలిసి ఆకాంక్షకు ట్రోఫీ బహూకరించారు. ముగింపు వేడుకకు అతిథిగా విచ్చేసిన స్టార్ షెట్లర్ సాత్విక్ సాయిరాజ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చాముండేశ్వర్‌నాథ్ మాట్లాడుతూ జూలై-ఆగస్టులో జరగనున్న పారిస్ ఒలింపిక్స్‌లో సాత్విక్ పతకం సాధిస్తే బీఎండబ్ల్యూ కారును కానుకగా ఇస్తానని ప్రకటించారు.

కష్టపడే కార్యకర్తలకు ప్రాధాన్యం

● కాంగ్రెస్ మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థి సునీతారెడ్డి


కేపీహెచ్‌బీ ఫంక్షన్‌హాల్‌లో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పట్నం సునీతారెడ్డి

కూకట్‌పల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో కష్టపడి పనిచేసే కార్యకర్తలకు పార్టీలో మంచి గుర్తింపు లభించడంతోపాటు సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందించేందుకు ఏర్పాటు చేయబోయే ఇందిరమ్మ కమిటీల్లో ప్రాధాన్యత ఇస్తామని కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతారెడ్డి అన్నారు. కేపీహెచ్‌బీకాలనీలోని కేపీహెచ్‌బీ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం నిర్వహించిన బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకులు తనను నాన్‌లోకల్ అంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని, కూకట్‌పల్లి ప్రాంతం ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోనే ఉందని, తాను రంగారెడ్డి జిల్లా జడ్పీటీసీగా సేవలందించన విషయాన్ని ప్రతిపక్ష నాయకులు తెలుసుకోవాలన్నారు. నగరానికి దూరంగా ఉన్న జిల్లాల నుంచి ఇక్కడకు వచ్చి పోటీ చేస్తున్న నాయకులు లోకల్‌గా చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. మల్కాజ్‌గిరి నియోజకవర్గంలోని అన్నీ ప్రాంతాల ప్రజలతో పట్నం మహేందర్‌రెడ్డితోపాటు తనకు ఎంతో అనుబంధం ఉందన్నారు.

మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించాలని ప్రజలను ఆమె కోరారు. అనంతరం బాలాజీనగర్, కూకట్‌పల్లి, మూసాపేట డివిజన్లకు సంబంధించిన పార్టీ కార్యాలయాలను ప్రారంభించి ఆయా డివిజన్ల బూత్ లెవల్ కార్యకర్తల సమావేశాల్లోను సునీతారెడ్డి పాల్గొని మాట్లాడారు. అంతకుముందు కేపీహెచ్‌బీకాలనీ, బాలాజీనగర్‌ల్లో ఆమె పాదయాత్ర చేస్తూ ఇంటింటికి కరపత్రాలను అందించారు. హస్తం గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను కోరారు.

కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్, కో ఆర్డినేటర్ వినయ్‌రెడ్డి, నాయకులు శేరి సతీష్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, తూము వేణు, సత్యం శ్రీరంగం, ప్రతాప్‌రెడ్డి, మేకల మైఖేల్, పొడుగు అప్పారావు, కృష్ణరాజ్‌పుత్, ఫణి తదితరులు పాల్గొన్నారు.

రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించండి

● బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి

● ఎమ్మెల్యే కేపీ వివేకానంద్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

గాజులరామారం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): షాపూర్‌నగర్ ఎంజేఎస్ గార్డెన్‌లో మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డితో కలిసి ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పాస్టర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ మాట్లాడుతూ దైవ సేవకుల మద్దతు, దేవుని ఆశీస్సు లు లక్ష్మారెడ్డిపై ఉండాలన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక పెట్టుబడులు, ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌ల నిర్మాణంతో హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరంగా మార్చిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని పక్కకు పెట్టి బీఆర్ఎస్ నాయకులపై ఎదురుదాడికి దిగుతూ పబ్బం గడుపుతోందని మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. ఎంపీ ఎన్నికల నేపథ్యంలో కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఫంక్షన్‌హాల్లో ప్రజాప్రతినిధుల, ముఖ్య నాయకులు కార్యకర్తలతో నిర్వహించిన సమావేశానికి ఆయన, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్య అతిథిలుగా హాజరై ప్రసంగించారు. బీజేపీ, కాంగ్రెస్‌లను పక్కకు పెట్టి మే 13న జరిగే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు.

జీడిమెట్ల డివిజన్‌లోని జయరామ్‌నగర్, గణేష్ హౌసింగ్ సొసైటీ, శ్రీకృష్ణనగర్, మహానగర్ కాలనీ, రుక్మిణి ఎస్టేట్, ప్రశాంత్‌నగర్ తదితర కాలనీల్లో ఎన్నికల ప్రచారాన్ని ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ నిర్వహించారు. కార్యక్రమంలో కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్నా శ్రీశైలం యాదవ్, వైస్ చైర్మన్ గంగయ్య నాయక్, బీఆర్ఎస్ నాయకులు, కౌన్సిలర్లు, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభానికి మంటలు


ఎగిసిపడుతున్న మంటలు

జీడిమెట్ల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జగద్గిరిగుట్ట ప్రాంతంలోని మగ్దూంనగర్, శ్రీనివాస్‌నగర్ ప్రాంతంలోని ఓ విద్యుత్ స్తంభం మంటల్లో కాలిపోయింది. నాగార్జున హైస్కూల్ పక్కనే ఉన్న స్తంభానికి ఉన్న వైర్ల నుంచి ఒక్కసారిగా మంటలు రావడంతో స్థానికులు ఆందోళన చెందారు. నీళ్లు చల్లి మంటలను అదుపు చేయడంతో ప్రమాదం తప్పింది. కేబుల్ వైర్ల ద్వారానే మంటలు వ్యాపించాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఇష్టానుసారంగా వైర్లు ఏర్పాటు చేసిన సంస్థలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రాంగ్‌రూట్‌లో వాహనాలు నడిపిన వారిపై కేసు

మియాపూర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): రాంగ్‌రూట్‌లో వాహనాలు నడుపుతున్న పలువురిపై మియాపూర్ ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేశారు. మియాపూర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్‌కుమార్, ఎస్ఐలు నవీన్‌కుమార్, సుభాష్ ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మియాపూర్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వద్ద రాంగ్‌రూట్‌లో వచ్చిన 13 ద్విచక్ర వాహనాలు, బాచుపల్లి సిగ్నల్ వద్ద రాంగ్‌రూట్‌లో వచ్చిన 10 ద్విచక్ర వాహనాలు, వాటర్ ట్యాంకర్లపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ రాంగ్‌రూట్‌లో వాహనాలు నడిపితే ప్రమాదాలు జరుగుతాయని, ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు.

బ్లాక్‌లో ఐపీఎల్ టికెట్లు అమ్ముతున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల అరెస్ట్

మాదాపూర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): బ్లాక్‌లో ఐపీఎల్ టికెట్లను అధిక ధరలకు విక్రయిస్తున్న ముగ్గురు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను సైబరాబాద్ ఎస్ఓటీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కొండాపూర్‌లో ఐపీఎల్ టికెట్లను ముగ్గురు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు సొంతూరి మధుబాబు, మాథ్యూ రోడ్రిక్స్, నిజంతన్ బ్లాక్‌లో అధిక ధరలకు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు విక్రయిస్తున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు సైబరాబాద్ ఎస్ఓటీ పోలీసులు దాడి చేసి వారి నుంచి సన్ రైజర్స్ రాయల్ చాలెంజర్ మ్యాచ్‌కు సంబంధించిన టికెట్లు 15, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని మాదాపూర్ పోలీసులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ఓటు హక్కు వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

ఓటు హక్కును వినియోగించుకోవాలి

గచ్చిబౌలి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లు తప్పకుండా తమ ఓటు హక్కును వినియోగించుకొని ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని శేరిలింగంపల్లి జీహెచ్ఎంసీ అధికారులు అన్నారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక్ ఆదేశాల మేరకు శేరిలింగంపల్లి సర్కిల్ అధికారులు కొండాపూర్ డివిజన్ పరిధిలోని కొత్తగూడ నేరేళ్లపార్కులో ఓటు హక్కు వినియోగంపై అవగాహన నిర్వహించారు. ప్రతి ఎన్నికల్లో గ్రామీణ ప్రాంతాల్లో 80 నుంచి 90 శాతంమంది ఓటు హక్కు వినియోగించుకుంటున్నారని, జీహెచ్ఎంసీ పరిధిలో 30 నుంచి 40 శాతం మాత్రమే ఓట్లు పోలవుతున్నాయని, విద్యావంతులు, మేధావులై ఉండి ఓటు హక్కు వినియోగించుకోవడం లేదని విచారణం వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరు రాజ్యాంగం ఇచ్చిన ఓటు హక్కు వినియోగించుకోవాలని పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా అధికారులు వాకర్లు, ఓటర్లతో రాబోయే ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి గోపాల్, పారిశుధ్య నిర్వహణ అధికారి జలేందర్‌రెడ్డి, పార్కు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో భౌతిక దాడులను అరికట్టాలి

రాయదుర్గం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సెంట్రల్‌యూనివర్సిటీలో భౌతిక దాడులను అరికట్టాలని డిమాండ్ చేస్తూ బీఎస్ఎఫ్, డీఎస్‌యూ, ఎన్ఎస్‌యూఐ, టీఎస్ఎఫ్, ఎంఎస్ఎఫ్, ఏఐఎస్ఏ, ఎస్ఎఫ్ఐ సంఘాల నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హెచ్‌సీయూ అధ్యక్షుడు అతిక్ మైమద్, ప్రధాన కార్యదర్శి కృప మాట్లాడుతూ వర్సిటీ అనేక సంవత్సరాలుగా గ్లోబ ల్ ర్యాంకింగ్‌లో ముందు వరుసులో ఉంటుందని తెలిపారు. అలాంటి వర్సిటీలో కొంతమంది మతోన్మాదంతో విద్యార్థులను వారి అకాడమిక్, నైపుణ్యాన్ని అడ్డుకుంటూ విద్యార్థుల మధ్య చిచ్చుపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్నేళ్లుగా ఎలక్షన్స్‌లో ఏబీవీపీ ఓటమి పాలవుతుందని తెలిపారు. ఓటమిని జీర్ణించుకోలేని ఆ సంఘానికి చెందిన కొంతమంది వ్యక్తులు విద్యార్థులపై దాడులు చేస్తూ క్యాంపస్‌లో అలజడి సృష్టిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఇలాంటి చర్యలు మానుకోవాలన్నారు. కొద్ది రోజుల క్రితమే క్యాంపస్‌లో ఫేర్వేల్ పార్టీ కమిటీ మెంబర్లపై సైతం భౌతికంగా దాడిచేసి గాయపరిచారన్నారు. ఇప్పటికైనా వర్సిటీ యాజమాన్యం స్పందించి క్యాంపస్‌లో అలజడి సృష్టిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల్లో ఓటర్ల విజ్ఞతే భవితకు నాంది

● దేశంలో పెరుగుతున్న రాజకీయ అవినీతి, నిరంకుశ నాయకత్వం, సహజ వనరుల దోపిడీ

● పార్టీల అధినేతల మధ్య కుస్తీ పోటీలుగా రాజకీయాలు

● ఆచార్య కొండవీటి చిన్నయ సూరి

● 'ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల తీరుతెన్నులు'పై చర్చా గోష్ఠి


చర్చా గోష్ఠిలో ప్రసంగిస్తున్న ఆచార్య కొండవీటి చిన్నయ్యసూరి

గుంటూరు (కార్పొరేషన్), ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): 'రాష్ట్ర అభివృద్ధి, సమాజ సమష్టి ప్రయోజనాలను పెంపొందించేందుకు ఎన్నికల్లో ఓటర్లు విజ్ఞతతో ఓటు హక్కును వినియోగించుకోవాలి. అదే వారి భవితకు నాందిగా మారుతుంది' అని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు కొండవీటి చిన్నయసూరి పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల తీరుతెన్నులు అనే అంశంపై జన చైతన్య వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం గుంటూరులోని జన చైతన్య వేదిక హాలులో జరిగిన చర్చా గోష్ఠిలో ఆయన ప్రసంగించారు. 1952లో ఓటింగ్ 43 శాతం ఉండగా, 2019 నాటికి అది 80 శాతానికి పెరిగిందన్నారు. ఓటర్లలో రాజకీయ పరిజ్ఞానం, విద్యా ప్రమాణాలు అభివృద్ధి చెంది ఓటింగ్ శాతం పెరుగుతుందని, అదే సందర్భంలో రాజకీయ అవినీతి, నిరంకుశ నాయకత్వం, సహజ వనరుల దోపిడీ కూడా అదే స్థాయిలో పెరుగుతున్నాయన్నారు. సుస్థిరతను, అభివృద్ధిని, ప్రజాస్వామ్య విధానాన్ని అందించ గలిగే నాయకత్వాన్ని ప్రజలు ఎన్నుకోవాలని సూచించారు. రాజకీయ పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యాన్ని పెంపొందించలేకపోతే ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యక్తి కేంద్రంగా పార్టీలు, ప్రభుత్వాలు కొనసాగుతాయన్నారు. నేడు రాజకీయాల్లో ధనవంతులు, వ్యాపారవేత్తలు కీలక పాత్ర పోషిస్తూ ఓటర్లను డబ్బులు, మద్యం లాంటి ప్రలోభాలకు లోనుచేస్తూ, కులం, మతం, ప్రాంతాల వారీగా విభజిస్తూ వారి ప్రయోజనాలను కాపాడుకుంటున్నారన్నారు. రాజకీయ పార్టీల మధ్య సైద్ధాంతికపరమైన బేదాలు క్షీణించి పార్టీల అధినేతల మధ్య కుస్తీ పోటీగా రాజకీయాలు మారుతుండడం సమాజ వికాసానికి మేలు జరగదన్నారు.

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.రంగయ్య ప్రసంగిస్తూ అభ్యర్థుల ఎంపిక పార్టీ సభ్యుల ప్రమేయం లేకుండానే జరుగుతున్నాయన్నారు. కార్పొరేట్ శక్తుల మధ్య పోటీగా రాజకీయాలు మారాయన్నారు. సభకు అధ్యక్షత వహించిన జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ... గతంలో అభ్యర్థుల ఎంపిక నైతిక విలువలు, త్యాగాల ప్రాతిపదికగా జరిగితే నేడు గెలుపు గుర్రాల పేరుతో ధన బలం, కుల బలం ఉన్నవారినే రాజకీయ పార్టీలు ఎంపిక చేస్తున్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి, ఉపాధి ఉద్యోగ అవకాశాలు మెరుగవడానికి తోడ్పడే అభ్యర్థులను ఎన్నుకోవాలని కోరారు. వ్యక్తి ప్రయోజనం కన్నా సమాజ ప్రయోజనానికి తోడ్పడే వారిని గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పూర్వ రిజిస్ట్రార్ రావెల సాంబశివరావు, మద్రాసు విశ్వవిద్యాలయ రాజనీతిశాస్త్ర ఆచార్యులు ప్రొఫెసర్ కోటేశ్వరప్రసాద్, ప్రోగ్రెసివ్ ఫోరమ్ నేత మల్లికార్జునరావు, అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, మానవత సంస్థ చైర్మన్ పావులూరి రమేశ్, ప్రసంగించారు.


సర్వేయర్లతో మాట్లాడుతున్న కమిషనర్ సత్యనారాయణ

కబ్జా స్థలాన్ని కాపాడుతాం

● కేవీఆర్ లే అవుట్‌ను సందర్శించిన మున్సిపల్ అధికారులు

దుండిగల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): రూ.100 కోట్ల పార్కు స్థలాలు కబ్జా..అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి దుండిగల్ మున్సిపల్ అధికారులు స్పందించారు. దుండిగల్ కమిషనర్ సత్యనారాయణ, సిబ్బంది, టీపీఓ సంజనతో కలిసి కేవీఆర్ లే అవుట్‌ను సందర్శించారు. మల్లంపేట్‌లోని సర్వేనంబర్ 11,12,13,15,22,23,24, 25,26,27,28,29,30,31,32,33,3435,36,37,38,45,46,61,262,263 ఈ సర్వే నంబర్లలో ఏర్పడిన కేవీఆర్ లే-అవుట్‌లో ఎన్ని పార్కులుఉన్నాయి. ఎంత స్థలం కబ్జా అయిందని, కబ్జా అయిన స్థలంలో ఎన్ని ఇళ్లు వెలిశాయి. అనుమతులతో నిర్మించిన ఇళ్లు ఎన్ని, అనుమతి లేని ఇళ్లు ఎన్ని, వాటిని కూడా నిర్ధారించి ప్రైవేట్ సర్వేయర్లతో డిజిటల్ సర్వే చేయించి, కబ్జా అయిన స్థలాలను కాపాడుతామని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ అన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చే అధికారులను ఉపేక్షించం

● కూన శ్రీశైలంగౌడ్


అధికారులతో మాట్లాడుతున్న కూన శ్రీశైలంగౌడ్

జీడిమెట్ల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): బస్తీలు, కాలనీలకు మంచినీటి సరఫరా సక్రమంగా చేయకుండా, వ్యాపార కేంద్రాలకు నీటిని సరఫరా చేస్తూ ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చే అధికారులను ఉపేక్షించేది లేదని కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల పారిశ్రామికవాడలోని మెట్రోవాటర్ సరఫరా కార్యాలయాన్ని ఆయన శుక్రవారం సందర్శించి రికార్డులను పరిశీలించారు. బస్తీల్లో తాగునీటి కనెక్షన్ ఉన్న వాళ్లకు సరైన సమయంలో నీళ్ల సరఫరా కావడం లేదన్నారు. డొమెస్టిక్ కనెక్షన్ పేరిట కమర్షియల్ కనెక్షన్లు ఉన్న వారికినీటి సరఫరా చేస్తూ కొందరు అధికారుల, సిబ్బంది ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావాలని చూస్తున్నారన్నారు. వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఎటువంటి ఇబ్బందులు ఉన్నా తాను ఉన్నతాధికారులతో మాట్లాడుతానని ప్రజలకు హామీ ఇచ్చారు.


పార్టీలో చేరిన వారితో శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరికలు

హైదర్‌నగర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్‌కు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్, చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి సోదరుడు నరేందర్‌రెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ ప్రారంభించారు. పార్టీలో చేరిన వారిలో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, మైనార్టీ మహిళ అధ్యక్షురాలు షేక్‌బీబీ, శ్యామల, నికత్ ఫాతిమా, పలువురు కీలకనేతలు చేరినట్లు వారు తెలిపారు.


మియాపూర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్, రంజిత్‌రెడ్డి తనయుడు ఆర్యన్‌రెడ్డి, తదితరులు

మోదీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపాలి

మియాపూర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మంచిచేసే కాంగ్రెస్ పార్టీని ప్రజలందరూ ఆదరించాలని శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ కోరారు. శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి మద్దతుగా ఆయన కుమారుడు ఆర్యన్‌రెడ్డి, నాయకులతో కలిసి మియాపూర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ ఓటర్లకు కరపత్రాలు అందించి కాంగ్రెస్‌కు ఓట్లువేసి రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఇలియాస్ షరీఫ్, వీరేందర్‌గౌడ్, మన్నేపల్లి సాంబశివరావుతో పాటు పలువురు పాల్గొన్నారు.


పోలీసుల అదుపులో అన్మోల్, తరుణ్, మల్లేష్

డబ్బు రవాణా వాహనాన్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు

కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ నెక్సస్ మాల్ వద్ద శుక్రవారం ఈసీ నిబంధనలను ఉల్లంఘించిన రైటర్ సేఫ్ గార్డ్ (డబ్బు రవాణా వాహనం) టీఎస్ 08 యూడీ 3730ను ఎస్ఓటీ బాలానగర్ టీం, కేపీహెచ్‌బీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆ వాహనంలో ఉన్న అన్మోల్, తరుణ్, మల్లేష్‌లను అదుపులోకి తీసుకని వారి వద్ద నుంచి రూ.1,37,635 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఆ నగదుకు సంబంధించిన లెక్కలు చెప్పకపోవడంతో కేపీహెచ్‌బీ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.